క్లుప్తంగా

రాజవొమ్మంగి విద్యార్థినికి ఉచిత ఇంజినీరింగ్ సీటు



రేణుకాలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శిరీష, సిబ్బంది

రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ (ఎంపీసీ)లో మంచి మార్పులతో పాస్ అయిన గాది రేణుకాలక్ష్మికి అమరావతి వీఐటీలో ఉచిత ఇంజినీరింగ్ సీటు వచ్చినట్టు ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. ఈ మేరకు అమరావతి విశ్వవిద్యాలయం నుంచి లేఖ అందినట్లు పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల పాటు ఉచిత విద్య, వసతి, భోజనం తదితర అన్ని అవకాశాలు ఆమెకు లభిస్తాయన్నారు. రాజవొమ్మంగిలోని వెనుకబడిన తరగతుల కుటుంబానికి చెందిన రేణుకాదేవికి ఈ అవకాశం లభించడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

పంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ



ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీడీవో ఉమ

అరకులోయటౌన్: పారిశుధ్యం మెరుగునకు కృషిచేయాలని ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పోతంగి, కించుమండ, గసభ, గుంటసీమ నలుగు పంచాయతీలకు మంజూరైనా ట్రాక్టర్లను డుంబ్రిగుడలో వీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు సర్పంచ్‌లు మరింత కృషిచేయాలని కోరారు. ఎంపీడీవో ఉమ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు సునీత, నాగేశ్వరరావు, వెంటకరావు, చెల్లమ్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

వీఆర్‌పురం: మండలంలోని పెదమట్టపల్లి పంచాయతీ పరిధిలోని గుర్రంపేటలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కారం లక్ష్మి,సర్పంచ్ వెట్టి లక్ష్మి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు మండల కేంద్రం రేఖపల్లి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పుడు సీసీరోడ్డు నిర్మించడంతో వారి బాధలు తీరనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

52 మందికి వైద్య సేవలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని పాతవెలగలపాలెం, కొత్తవెలగలపాలెంలలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి వైద్యసేవలందించినట్టు 104 డీఈవో శ్రీనివాస్ తెలిపారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని, దోమతెరలు ఉపయోగించాలని వైద్య సిబ్బంది సూచించారు. సుగర్, బీపీ ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. హెచ్‌వీ రమాబాయి, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఏఎన్ఎం శేషారత్నం పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి పెట్టాలి'

అడ్డతీగల: జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణపై గిరిజన ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో ఖాళీలను భర్తీ చేయాలని, మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఆదివాసీ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పెదబయలు ఏకలవ్య పాఠశాలలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శేఖర్‌బాబు



పాల్గొన్న విద్యార్థులు

పెదబయలు: చెడు వ్యసనాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని పాడేరు ఎక్సైజ్ సర్కిల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌బాబు తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రత,క్రమ శిక్షణ కలిగి ఉండాలని చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహనరావు, ఎక్సైజ్ ఎస్ఐలు శేఖరం, టి.సునీల్‌కుమార్, పెదబయలు పోలీసు సిబ్బంది పెదబయలు,ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు కేశవరావు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీఐ సన్యాసి నాయుడు తెలిపారు. మండలంలోని బాకురు గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి ఆయన మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో చాలా మంది విద్యార్థులు గంజాయి,సారా వంటి చెడు అలవాట్లకు బానిసలై చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: సమాజంలో ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అడ్డతీగల ఎస్ఐ ఎ.అప్పలరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాలు, వాటి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు లోనుకాకుండా విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని తెలిపారు. వ్యసనాలకు బానిసలైతే ఆరోగ్యం పాడై జీవితాలు నాశనం అవుతాయని, కేసుల్లో ఇరుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతుందన్నారు.



బాకురు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ నాయుడు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అప్పలరాజు

గిరిజన నేత రాజుబాబుకు ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మణరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజు

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లికి చెందిన భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజుబాబు తండ్రి మొట్టడం లక్ష్మణరావు సోమవారం రాత్రి మరణించారు. ఈయన మరణ వార్త తెలుసుకుని మంగళవారం పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గ్రామానికి చేరుకుని రాజుబాబును పరామర్శించారు. లక్ష్మణరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గూడెంకొత్తవీధి మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, జీకేవీధి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందేరి రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యరాజు జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, దామనాపల్లి ఎంపీటీసీ భీమారావు, లక్కవరపేట సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ఘన సన్మానం

సాక్షి,పాడేరు: స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు క్రిస్టియన్ సంఘాల నేతలు మంగళవారం ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు పాడేరులో ఎమ్మెల్యేకు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకులు పీలా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సన్మానిస్తున్న క్రిస్టియన్ అసోసియేషన్ ప్రతినిధులు

గంజాయి సాగు,రవాణా చేస్తే చర్యలు

జి.మాడుగుల: గంజాయి సాగు,రవాణా, నాటుసారా తయారీ విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రమేష్ హెచ్చరించారు. మండలంలో పాలమామిడి గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచి నీటి సమస్య ఎదుర్కొంటున్నట్టు గ్రామస్తులు సీఐ దృష్టికి తేవడంతో సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహరించాలని ఆయన కోరారు.



పాలమామిడిలో అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

ఘనంగా నాగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ కార్యాలయం వెనుక ఇల్లా లచ్చిరెడ్డి వీధిలో కొలువైన మాతృశ్రీ నాగమ్మతల్లి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు.అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం డైరెక్టర్ కారుకోడి పూజ,ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, వెంకన్నబాబు, రంపచోడవరం ధర్మప్రచార భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చెట్ల కొమ్మలను తొలగించాలి



గాలికొండ వ్యూపాయింట్ సమీపంలోని విరిగిపడిన చెట్టు కొమ్మలు

అనంతగిరి: మండలంలోని ఘాట్‌రోడ్డుకు ఆనుకుని ఎండిపోయిన చెట్లు ప్రమాదభరితంగా మారాయని, వాటిని వెంటనే తొలగించాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అంగనైని ఆనంద్ కోరారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో అరకు, అనంతగిరి ఘాట్‌రోడ్డులో చెట్ల కొమ్మలు విరిగిపడి ఉన్నా ఎన్‌హెచ్5 శాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రమాదాలు జరిగితే గానీ పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించాలని కోరారు.

ఈదురు గాలులతో వర్షం



అప్పలరాజుపేటలో కురుస్తున్న వర్షం

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులు,ఈదురు గాలులతో వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం వ్యవసాయానికి మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

గుల్లేలు కాలనీలో పాము కలకలం



గుల్లేలు కాలనీ వాసులు హతమార్చిన పాము

పెదబయలు: మండలంలోని గుల్లేలు పంచాయతీ గుల్లేలు కాలనీలో గంపరాయి సుబ్బారావు అనే వ్యక్తి ఇంటి సమీపంలో పది అడుగుల పాము కలకలం సృష్టించింది. రచ్చబండ పైన ఉన్న చెట్టు నుంచి జారి పాము కింద పడింది. గమనించిన గ్రామస్తులు దానిని హతమార్చారు. పది అడుగుల పామును గ్రామంలో చూడడం ఇదే మొదటిసారని గ్రామస్తులు తెలిపారు.

రైతన్నలు బిజీబిజీ

వరి నారుమడుల పనుల్లో నిమగ్నం



దుక్కి పనుల్లో అన్నదాత



బోర్లు ఆధారంగా వేసిన వరి నారుమడి

చోడవరం: అన్నదాతలు వ్యవసాయ పనులతో బిజీబిజీగా మారారు. నాలుగు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పనులు ప్రారంభించారు. నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ఇదే సమయంలో గ్రామ సచివాలయాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ బుకింగ్‌పై వారికి కావలసిన విత్తనాలను సమకూర్చుకున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు తమ వద్ద విత్తనాలను ఇప్పటికే నారుమడుల్లో వేసేందుకు విత్తన శుద్ధి చేయగా, వర్షాధారంపై రైతులు నారుమడుల్లో విత్తనాలు జల్లేందుకు సిద్ధమయ్యారు. తొలకరి వర్షాలు వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగపడింది. పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమైన నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో 26 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి వేసేందుకు రైతులంతా సిద్ధమయ్యారు.

జోరుగా వరి విత్తనాల పంపిణీ...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కొత్తగా ఏర్పడ్డ ఎన్డీఏ ప్రభుత్వం ఇంకా రైతులకు పెట్టుబడుల నిమిత్తం రైతు భరోసా డబ్బులు వేయకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే వర్షాలు కురుస్తుండటంతో పొలం పనులు మాత్రం ప్రారంభించారు. నియోజకవర్గంలో హెచ్చు సాగు భూమి వర్షాధారంపైనే ఉండటంతో పూర్తిస్థాయిలో వర్షాలు కురిస్తేనే అనుకున్న మేర సాగు చేయడానికి అవకాశముంది. ఈ పరిస్థితిలో ఈశాన్య రుతుపవనాలు పుణ్యమా అని మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడ చూసినా రైతులు నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. సీజన్ ప్రారంభం నుంచే పూర్తిస్థాయిలో అన్ని రకాల విత్తనాలు వ్యవసాయ శాఖకు చేరడంతో గ్రామ సచివాలయాల ద్వారా విక్రయాలు జోరందుకున్నాయి. పల్లం, ముంపు ప్రాంతాల్లో ఆర్జీఎల్, స్వర్ణ, 1001, జయ, రకాలపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అయినప్పటికీ ఈ ఏడాది ఆర్జీఎల్, సోనామసూరి, సాంబమసూరి, స్వర్ణ, అమర(1064)రకాలు అందుబాటులో ఉంచారు. ఆర్బీకేలతోపాటు లైసెన్సుతో నడిచే ప్రైవేటు ఎరువుల దుకాణాల్లోనూ వరి విత్తనాలు అమ్మకాలు ప్రారంభించారు.

801 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకం

ఎంపీడీవో వీరసాయిబాబు



మాట్లాడుతున్న ఎంపీడీవో వీరసాయిబాబు

చింతపల్లిరూరల్: మండలంలో 1,800 ఎకరాల హార్టీకల్చర్ భూమిని గుర్తించామని ఎంపీడీవో వీరసాయిబాబు తెలిపారు. అందులో 801 ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్,సీతాఫలం,అవకాడో,సిల్వర్ ఓక్, నిమ్మ,మామిడి,జామ,జీడి మామిడి తదితర పండ్ల మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ మొక్కలు నాటేందుకు రైతులు నెలాఖరులోపు గుంతలు తవ్వుకోవాలని ఆయన సూచించారు. స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫిల్డ్ అసిసెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో ఉపాధి వేతనదారులందరికీ 100 రోజుల పాటు పనులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్నావారికి 150 రోజుల పాటు పనిదినాలను కల్పించినట్టు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం : సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వీరసాయిబాబు తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సచివాలయ, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా,డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టాలని, నీటి నిల్వ లు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కె.ఎల్.ఎస్. మూర్తి,ఈసీ మధుసూధన్,ఆర్‌డబ్ల్యూజేఈ స్వర్ణలత,ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్,ఏవో రవింద్ర పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన



రేఖపల్లి భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఎంవో భాస్కరరావు

వీఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి భవితా కేంద్రం, ఎంఆర్‌సీని అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్(ఏఎంవో) కె.భాస్కరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సీఆర్‌పీలతో సమావేశం నిర్వహి ంచి పలు అంశాలపై చర్చించారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను విద్యా ప్రవేశ్ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలపై ఆరా తీశారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఎంతమంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలలో చేర్పించారు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

హెచ్‌బీ శాతం తక్కువ ఉన్న విద్యార్థినులకు ప్రత్యేక ఆహారం



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థినులకు ప్రత్యేక ఆహారం ఇవ్వాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో 169 మంది బాలికలకు మలేరియా వ్యాధి నిర్ధారణ, రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డాక్టర్ సుష్మ మాట్లాడుతూ నలుగురు విద్యార్థినుల్లో హిమోగ్లోబిన్ 8 కంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి ప్రత్యేక ఆహారం అందజేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌కి సూచించినట్టు చెప్పారు. కళాశాల ఆవరణలో గల డ్రైనేజీలను శుభ్రపరచాలని, మురుగు నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులు తప్పక దోమతెరలు ఉపయోగించేలా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ సలోమి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సోమరాజు, హెచ్‌వీ లక్ష్మమ్మ, ఎల్‌టీ తమ్మారావు, ఏఎన్ఎం సత్యవతి, రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ నానిబాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

జి.మాడుగుల: దుకాణాల యజమానులు 14 సంవత్సరాలలోపు బాలలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని లేబర్ డిపార్టుమెంట్ జిల్లా ఇన్‌చార్జి అధికారి టి.సుజాత హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన మాసోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పలు దుకాణాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 14 సంవత్సరాలు నిండని ఇద్దరు బాలలు షాపుల్లో పనిచేస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. ఆ దుకాణ యజమానులపై కోర్టులో కేసులు వేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో ఎవరైనా దుకాణాల యజమానులు బాలలను పనిలో పెట్టుకుంటే చోడవరం సహాయ కార్మికఅధికారి (ఫోన్‌నంబర్ 9492555018)కి తెలియజేయాలని ఆమె తెలిపారు. చోడవరం కార్మికాధికారి పి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీఆర్‌పురం: కంటి సమస్యలపై అశ్రద్ధ చూపవద్దని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు అన్నారు. రేఖపల్లిలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 57 మందికి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అందజేసినట్టు చెప్పారు. కంటి సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో 186 మందికి రాజమండ్రిలో కంటి ఆపరేషన్లను నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు డాక్టర్ కిషోర్,డాక్టర్ సమీర, ఏఎస్‌డీఎస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే మత్స్యలింగం సమావేశం

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 10 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

చుట్టుమెట్ట మృతుల కుటుంబాలకు పరామర్శ

పెదబయలు: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్టలో మృతి చెందిన గిరిజనుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు అన్నారు. మృతుల కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి గ్రామంలో పరిస్థితులను తీసుకువెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శరభ వేమనబాబు, జిల్లా కోశాధికారి కొర్రా ఆనందరావు,సీనియర్ నాయకులు డి. రమణ పాల్గొన్నారు.

ఒమ్మలిలో పైడితల్లమ్మ ఒడ్డు పండగ



ఘటం మోస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: ఒమ్మలిలో పైడితల్లమ్మ ఒడ్డు పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డాపు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పండగ సందర్భంగా 101 ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అమ్మవారి ఘటాన్ని నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పూజలు చేశారు. గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పరదేశమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో మంగళవారం పరదేశమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మహిళలు పసుపుకుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు.